# సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి సివిల్స్ విజేతగా..



**చిన్నతనంలోనే తండ్రి మరణం... వంటమనిషిగా పనిచేస్తూ అన్నను, తనను చదివించే తల్లి కష్టం... ఆర్థిక ఇబ్బందులు..ప్రజల సమస్యలు.. ఇవన్నీ పొమ్మాల సునీల్‌కుమార్‌ను సివిల్స్ వైపు అడుగులేయించాయి. రెండో ప్రయత్నంలోనే సివిల్స్‌లో 18వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. విజయ ప్రస్థానం ఆయన మాటల్లోనే...**

- **మీ కుటుంబ నేపథ్యాన్ని వివరిస్తారా?**

  నాన్న చిన్నతనంలోనే చనిపోయారు. అమ్మ సాంఘిక సంక్షేమ పాఠశాలలో వంటమనిషిగా పనిచేస్తుంది. అన్నయ్యను, నన్ను ఎంతో కష్టపడి చదివించింది.

- **మీ విద్యాభ్యాసాన్ని తెలియజేస్తారా?**

  నేను పదోతరగతి వరకు వైఎస్ఆర్ జిల్లా లక్కిరెడ్డిపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో చదివాను. పదో తరగతిలో 532 మార్కులొచ్చాయి. ఆ తర్వాత కడపలోని నాగార్జున కాలేజ్‌లో ఇంటర్, వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చదివాను.

- **సివిల్స్ రాయకముందు ఎక్కడైనా ఉద్యోగం చేశారా?**

  క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో టీసీఎస్‌కు ఎంపికయ్యాను. మూడేళ్లు చెన్నైలో, నాలుగేళ్లు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాను.

- **సివిల్స్‌ను లక్ష్యంగా ఎప్పుడు నిర్ణయించుకున్నారు? దీన్ని ఎంచుకోవడానికి ప్రత్యేక కారణాలున్నాయా?**

  పాఠశాల రోజుల నుంచే సివిల్స్ పట్ల ఆసక్తి కలిగింది. స్థానికంగా ఉన్న ఏ సమస్యలు తీరాలన్నా కలెక్టర్ గారికి చెబితే సమస్యలు తీరిపోతాయని గ్రామస్థులు అనుకునేవారు. అప్పుడే నేను కూడా కలెక్టర్ కావాలని అనుకున్నాను. అదేవిధంగా చిన్నతనంలోనే నాన్న చనిపోవడం, ఇంట్లో ఆర్థిక సమస్యలు, మా అన్నయ్య ప్రోత్సాహం... ఇవన్నీ కారణమయ్యాయి.

- **ప్రిపరేషన్ ఎప్పుడు ప్రారంభించారు? ఎవరైనా సాయమందించారా?**

  ఉద్యోగానికి రాజీనామా చేసి అక్టోబర్ 20, 2008 నుంచి పూర్తిస్థాయిలో సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. అమలాపురంలో ఆర్డీఓగా పనిచేస్తున్న మా అన్నయ్య ప్రోత్సాహం, గైడెన్స్‌తో సివిల్స్‌కు ప్రిపేరయ్యాను.

- **మొదటిసారి సివిల్స్ ఎప్పుడు రాశారు?**

  2009లో మొదటిసారిగా సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అందులో పది మార్కుల తేడాతో సర్వీసును కోల్పోయాను.

- **ప్రిలిమ్స్‌కు ఎలా ప్రిపేరయ్యారు? మీ ఆప్షనల్ ఏమిటి?**

SAKSHI

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆప్షనల్ సబ్జెక్టుగా ప్రిలిమ్స్ రాశాను. ప్రిలిమ్స్‌కు ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు.

- **మెయిన్స్ కోసం ఏ ఆప్షనల్స్‌ను ఎంచుకున్నారు? కోచింగ్ ఎక్కడ తీసుకున్నారు?**

మెయిన్స్ పరీక్ష కోసం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ సబ్జెక్టులను ఎంచుకున్నాను. ఢిల్లీలో ఉన్న సింక్రోనస్ కోచింగ్ సెంటర్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్వ్యూ కోసం కోచింగ్ తీసుకున్నాను. దాని చైర్మన్ అభయ్ఠాకూర్ నన్ను అన్నివిధాలా ప్రోత్సహించారు. నేను ఇంత మంచి ర్యాంకు సాధించానంటే కచ్చితంగా ఆయన క్రెడిటే. జాగ్రఫీ కోసం అలోక్ రంజన్ ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకున్నాను.

- **ఇంజనీరింగ్ చదివారు కదా.. ఆర్ట్స్ సబ్జెక్టులు ఎంచుకోవడానికి కారణం?**

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ సబ్జెక్టుల్లో మెటీరియల్ తేలికగా దొరుకుతుంది. అంతేకాకుండా ఫీల్డ్ స్టడీ ఉన్న సబ్జెక్టు కావడంతో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఎంచుకున్నాను. మా అన్నయ్య కూడా ఇవే తీసుకోమని సూచించాడు.

- **పరీక్షకు ఎలా ప్రిపేరయ్యారు?**

కోచింగ్‌లో నాకు గోవిందరావు (సివిల్స్‌లో తాజా 31వ ర్యాంకర్) అనే మంచి పార్టనర్ దొరికాడు. మేమిద్దరం ఒకరికొకరం ఏదైనా చర్చించుకోవడం, సందేహాలు ఏమైనా ఉంటే నివృత్తి చేసుకోవడం చేసేవాళ్లం. సివిల్స్ ప్రిపరేషన్‌కు మంచి భాగస్వామిని ఎంచుకుంటే పని తేలికవుతుంది.

- **ప్రిపరేషన్‌లో ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నారు?**

జాగ్రఫీ సబ్జెక్టు నన్ను విపరీతంగా భయపెట్టింది. ముఖ్యంగా అందులో కొన్ని చాప్టర్స్ కఠినంగా ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో పరీక్ష తప్పుతానేమో అనిపించింది.

- **మీ ఇంటర్వ్యూ ఎలా జరిగింది? ఏఏ ప్రశ్నలు మిమ్మల్ని అడిగారు?**

నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేయడంతో ఎక్కువగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంబంధిత ప్రశ్నలు అడిగారు. అదేవిధంగా కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లోనే నక్సలిజం ఎందుకు ఉందని అడిగారు. తెలంగాణ సమస్య, శ్రీకృష్ణ కమిటీ నివేదిక– పర్యవసానాలు, నేను అమెరికాలో ఉండటం వల్ల అమెరికా – ఆర్థిక సంక్షోభం మొదలైనవాటిపై ప్రశ్నలు అడిగారు. అన్నింటికీ సంతృప్తికరంగా సమాధానమిచ్చాను.

- **ఒత్తిడిని ఎలా అధిగమించేవారు?**

ఒత్తిడిగా అనిపించినప్పుడు మా అమ్మ, అన్నయ్య, అన్నయ్య పిల్లలు, స్నేహితులతో మాట్లాడేవాడిని. బ్రహ్మానందం, రవితేజ హాస్య సన్నివేశాలు చూసి సేదతీరేవాడిని.

- **మీ రోల్‌మోడల్?**

మా అన్నయ్యే నా రోల్‌మోడల్. ప్రతి సందర్భంలోనూ నన్ను ఎంతగానో ప్రోత్సహించేవాడు.

- **మిమ్మల్ని బాగా ప్రభావితం చేసిన సంఘటనలు ఏమైనా ఉన్నాయా?**

అమెరికాలో ఉన్నప్పుడు అక్కడ వ్యక్తుల్లో క్రమశిక్షణ, ఏదైనా సంఘటన జరగ్గానే సత్వరం స్పందించే

పోలీస్ వ్యవస్థ, అడ్మినిస్ట్రేషన్ ఇవన్నీ నాపై ఎంతో ప్రభావం చూపాయి. మనదేశంలో కూడా ఇలా ఉంటే ఎంత బాగుంటుందో అనిపించేది.

- **ఇప్పుడున్న పరీక్ష విధానం ఓకేనా? ఇంకా ఏమైనా మార్పులు చేస్తే బాగుంటుందా?**

మెయిన్స్‌లో మార్పులు చేస్తే బాగుంటుంది.

- **సివిల్స్ సిద్ధమవుతున్న వారికి మీరిచ్చే సూచనలు?**

కలెక్టర్ కావాలని... ఏదో భావోద్వేగంతో నిర్ణయం తీసుకోకుండా మొదటి నుంచి సిన్సియర్‌గా కష్టపడాలి. శ్రమ, మంచి శిక్షణ, సాధించాలన్న నిబద్ధత ఉంటే సివిల్స్‌లో సత్తా చాటొచ్చు. ఓపిక, సహనం అవసరం.

- **మీ హాబీస్?**

పాటలు పాడుతాను. సినిమాలు బాగా చూస్తాను.

- **భవిష్యత్ ప్రణాళికలు?**

ప్రజలు మెచ్చుకునేలా పనిచేయడం.

## సగటు విద్యార్థి సివిల్స్ సాధించగలడా?

‘నేను సాధించగలను’ అని నమ్మినవాళ్లే విజేతలవుతారు. మంచి ప్రతిభ ఉన్న విద్యార్థి రెండు ప్రయత్నా ల్లో సివిల్స్ సాధిస్తే, సగటు విద్యార్థి నాలుగు ప్రయత్నా ల్లో విజయం సాధిస్తాడు. అంతే తప్పించి మరేమీ లేదు.

SAKSHI